# అక్షర లక్షలు

**పూజనీయులు మామగారికి సమస్కృతులతో ఉభయకుశలోపరి. మీ దగ్గరనుండి ఉత్తరాలులేవు. మీరూ, పూజనీయురాలు అత్తగారు కులాసాయని తలుస్తాను. నేను ఈ ఉత్తరం రాయడానికి ఎంతో బాధపడుతూ, సిగ్గు పడుతూ రాస్తున్నాను.**

అసలు సంగతి-- ఇక్కడ అనుకోకుండా ఒక ఇంటిస్థలం అమ్మకానికి వచ్చింది. దాని అసలు ఖరీదు ఈ రోజున అయితే నలభై వేలు వుంటుంది. నాకు ఆత్మీయుడైన వ్యక్తి కాబట్టి పదిహేను వేలకు ఇస్తానన్నాడు. సమయానికి నా దగ్గర అంత డబ్బు లేదు. నేను రెండు మూడు నెలల్లో జి.పి.యఫ్. ఎడ్వాన్స్ పెట్టి మీకు సర్దుతాను. నా సంగతి మీకు తెలుసు. అందరూ వున్నారు, కానీ, వున్నారని చెప్పుకోడానికే. అందు వలన ఏనాడూ మిమ్మల్ని చెయ్యి చాపి అడగని వాడిని అడిగేను. మీరు డబ్బు పంపకపోతే స్థలం కొనుక్కోలేను. డ్రాఫ్టు పంపించండి. తప్పనిసరి అయి ఈ అభ్యర్దన చేయవలసి వచ్చినందుకు మన్నించండి.

- భాస్కర్

ఇది మా పెద్దల్లుడు వ్రాసిన ఉత్తరం. కాదు డబ్బుకోసం ఇండెంట్. సుమారు పదిహేను సంవత్సరాల నుంచి ఉద్యోగం చేస్తూ పదిహేను వేలు లేవా? ఇప్పుడు తనదగ్గర లేని డబ్బు, మూడునెలల తర్వాత పెట్టే ప్రావిడెంట్ ఫండ్ లోన్, ఏమిటో చిత్రంగా వుంది.

"ఎక్కడనుండి ఉత్తరం?" అంది శ్రీమతి అప్పుడే వచ్చి వెనుకనుండి.

"పెద్దల్లుడు వ్రాశాడు చదువు" అని ఉత్తరం శ్రీమతికి ఇచ్చాను.

ఉత్తరం చదివి.

"అయ్యో పాపం, ఎలాగో సర్దుబాటు చెయ్యండి. వెనకా ముందూ ఎవరూ లేనివాడు. మంచివాడు. అతన్ని మనం ఆదుకోకపోతే ఎవరు ఆదుకుంటారు? అలాంటి వాణ్ని ఆదుకుంటే భగవంతుడు మనకుమేలు చేస్తాడు. మనం చివరి దాని పెళ్ళికి డిపాజిట్ చేశాం కదా. అందులోంచి లోన్‌తీసి పంపించండి." అంటోంది. దానికేం తెలుసు?

"చూద్దాంలే ఏదో ఒకటి చేస్తాను" అని నేను ఆలోచనల్లో పడ్డాను.

తల్లి తండ్రి లేకపోయినా నామమాత్రంగా అక్కలూ అన్నలూ వున్నాసరే, వాళ్ళల్లో ఐక్యత లేకపోయినాసరే, ఏదో పిల్లను పోషించుకోగలడని మా పెద్దమ్మాయిని ఇచ్చి చేశాను. ఇంతవరకూ అమ్మాయి నుండి అతని మీద ఫిర్యాదులు లేవు సరికదా మెచ్చుకోలు విషయాలు ఎక్కువ. అతనికి ఎటువంటి దురలవాట్లు లేవు. ఈ శతాబ్దంలో వుండవలసిన మనిషి కాదు, అనుకుంటాను అప్పుడప్పుడు.

తల్లిదండ్రులు అతని చిన్నతనంలోనే చనిపోవడం వలన, పెద్దలంటే ఎనలేని అభిమానం. మా ఇద్దరిలోనూ తన తల్లి దండ్రులను చూసుకునేవాడు.

ప్రతీసారీ అతను మమ్మల్ని కలుసుకోవడం తటస్థిస్తే పాదాభివందనం చేసేవాడు. ఏమిటో పిచ్చివాడు అనుకునేవాడిని. ఆ మాట కొస్తే మా ఏకైక సుపుత్రుని చేత కూడా ఈ సన్మానానికి నోచుకోలేదు.

మా శ్రీమతికి పెద్దల్లుడు భాస్కరం అంటే ఎనలేని అభిమానం.

అలాగే భాస్కరం కూడా, అత్తగారు తన ఇంటికి ఎప్పుడు వెళ్ళినా, జరీపట్టు చీరలే పెట్టేవాడు ఆమెకు.

"ఎప్పుడూ" ఎందుకు నాయనా నాకు చీరలు" అని ఆమె అంటే--

"నేను నా తల్లికి! పెట్టుకునే అదృష్టానికి నోచుకోలేదుకదా. నా సంతోషం కాదనకండీ" సజల నయనాలతో బాధపడేవాడు.

అతను తన అత్తగారిలో తన మాతృమూర్తిని చూసుకుని, ఆ ప్రేమాంబుధిలో మునిగి తేలుతున్న అనుభూతి చెందేవాడు.

పెద్దల్లుడు చారులో బెల్లం వేస్తే తినడు. కొద్దిగా ఉప్పు ఎక్కువ తింటాడు. అందుకని కంచం దగ్గర మెత్తని ఉప్పు పెట్టాలి. మంచి నీళ్ళు ఎక్కువ త్రాగుతాడు. అందుకని పెద్దస్టీలు చెంబుతో నీళ్ళు పెట్టాలి పరమాన్నం అంటే ఇష్టం అతనికి.

ఇలా నా శ్రీమతి అతనికి ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసేది. పెళ్ళి అయిన కొత్తలో నాకు కూడా ఇలా ముద్దు జరగలేదేమో. కారణం అది అపురూపమైన భాస్కరం ప్రేమాభిమానాల ఆకర్షణ శక్తి, అతని నడవడిలోని అయస్కాంత శక్తి, అతని మనసునిండా మేమంటే గల పూజ్యభావం అతని చేతల్లో ఆప్యాయత చూపుల్లో మెత్తదనం- అటువంటి సుగుణాలరాశి, మూపద్ద నూటికి నూటిరవై మార్కులు తెచ్చుకున్న వాడిదగ్గరనుండి డబ్బు కోసం అభ్యర్థన

వచ్చింది. ఇప్పుడు నేను ఏంచేయాలి?

అతనికి నేను డబ్బు తప్పక ఇవ్వాలి--

అయితే-

ఇందులో కొంత ఆలోచన చేయవలసిన విషయం వుంది.

నాకు ఉన్న నలుగురు అమ్మాయిలు, ఒక అబ్బాయికిగానూ, ముగ్గురమ్మాయిలకు, అబ్బాయికి వివాహం చేశాను.

కొన్ని కారణాల వలన పెద్దమ్మాయికి చదువు పెద్దగా చెప్పించలేని కారణంగానూ, అప్పటి పరిస్థితుల దృష్ట్యా తక్కువ కట్నంతో పెళ్ళి చేయవలసి వచ్చింది. తక్కువ రేటు కాబట్టి అల్లుడు కూడా చిన్న ఉద్యోగి అవడం జరిగింది.

మిగతా అమ్మాయిలు ఎక్కువగా చదువుకోడంతో వాళ్ళందరికీ, ఎక్కువ కట్నం, చదువులు, ఉద్యోగాలు ఎక్కువ వున్నవాళ్ళకు ఇవ్వవలసి వచ్చింది. వాళ్ళ వివాహాలలో నేను భాస్కరం ఎదురుగా అసౌకర్యంగా వుండేవాడిని. గభాల్న మా పెద్దల్లుడు అని చెప్పాలంటే ఎలాగో వుండేది. ఇంకో విధంగా అతనికి తక్కువ కట్నం ఇచ్చామని బాధపడుతున్నాడేమోనని భయం కూడా వుండేది.

మా ఇంట్లో జరిగే వివాహాలలో రెక్కలు ముక్కలు చేసుకుని, మా ఇంట్లో రెండవ కొడుకులా, నా శ్రీమతి సలహాలతో, ఆమెకు సహకరిస్తూ శుభకార్యాలు ఎంతో చక్కగా నిర్వర్తించాడు. అతని మనస్సులో అటువంటి దురుద్దేశం వుందని అనుకోను నేను.

అయినా నాకు ఎందుకు ఇటువంటి ఆలోచన?

ఎందుకంటే? నా దగ్గర అప్పుగానే అని చెప్పి ఇప్పుడు పదిహేనువేలు తీసుకుని, తరువాత "నాకు తక్కువ కట్నం ఇచ్చారు కాబట్టి ఆ డిఫెరెన్స్ కింద ఈ డబ్బు జమ చేసుకోండి" అన్నాడే అనుకో--

అమ్మో కొంప మునిగిపోతుంది. భాస్కరంలో ఇటువంటి ఆలోచన వుందా? ఏమో? డబ్బు ఏ పని అయినా చేయిస్తుంది. నాకు, శ్రీమతికి భాస్కరం అంటే ఎనలేని ప్రేమాభిమానాలు వున్నాయి. అతను మా ఇంట్లో కలిసిపోయాడు. అతనికి ఎవరూ దిక్కులేరు. డబ్బు పంపకపోతే స్థలం కొనుక్కోలేడు. మా అమ్మాయి కూడా బాధపడుతుంది.

కాని-

డబ్బు ? అది ఎక్కడ నుంచి వస్తుంది? ఒక వేళ అది తిరిగి రాలేదనుకో ఒకటా ? రెండా ? పదిహేను వేలు ?

అమ్మాయి కావాలంటే నాలుగొందలు పెట్టి చీర కొంటాను.

అల్లుడికి సూట్ కొంటాను.

కాని-ఇంత డబ్బు అతను అప్పుగా అడిగినా ఇవ్వడం అభిలషణీయం కాదని నా మనస్సు పదే పదే హెచ్చరించింది. మాటలా? ఎంత కష్టపడి సంపాదించిన డబ్బు. అందుకని మా శ్రీమతికి చెప్పకుండా ఒక నిర్ణయం తీసుకున్నాను.

" భాస్కరానికి శుభాశీస్సులతో ఉభయకుశలోపరి. మీ ఉత్తరం అందింది. నేను ఎటువంటి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నానో వ్రాయలేను.

నేను మొదటిసారిగా మీరు అప్పుగా అడిగిన డబ్బు ఇవ్వలేక పోయినందుకు సిగ్గుగా వుంది. ఈ ఉత్తరం వ్రాసిన ఈ చేతిని నరుక్కోవాలని వుంది. మీ అత్తగారు కూడా చాలా బాధపడుతోంది. నన్ను క్షమించండి"--

నా గుండెల్లో కొన్ని టన్నుల బరువు దిగింది ఆ ఉత్తరంలో. అతను తిప్పలు అతను పడతాడు. పదిహేను వేలు సంపాదించలేని అప్రయోజకుడు ఎంత బుద్ధిమంతుడైతే మాత్రం ఎందుకు? మనం డబ్బు సర్దలేకపోతే ఎక్కడో ఒక చోట చూసుకుంటాడు.

ప్రేమాభిమానాలు ఎంతవరకు పరిమితం? తన దగ్గర డబ్బు లేనప్పుడు విలువలేని ఈ పిచ్చి ప్రేమాభిమానాలు ఎందుకు? ఎవరికి కావాలి? ఏం చేసుకోను?

డబ్బు వుంటే కొండ మీద కోతిని దింపవచ్చు. అతని బోడి ప్రేమాభిమానాలు, పాదాభివందనాలు ఎందుకు? నేను ఈ విధంగా నా మనసును శోధించుకుంటున్నాను. ఒక వారం రోజులు సూర్యచంద్రులు తమ డ్యూటీ చేశారు.

భాస్కరం నుంచి ఉత్తరం వచ్చింది, ముత్యాల్లాంటి అక్షరాలతో.

"మీ దగ్గర నుండి డ్రాఫ్టు కోసం ఎదురు చూస్తున్న తరుణంలో, మీ ఉత్తరం నా పాలిట విద్యుద్ఘాతం అయింది. మీరు ప్రస్తుతం వున్న ఆర్థిక ఇబ్బందుల్లో మీకు సహాయం చెయ్యలేని అసమర్థుడైన అల్లుణ్ణి, అని నేను బాధపెడుతున్న తరుణంలో నా బాధకు పరిష్కారం దొరికింది.

చిన్నప్పటి నుండీ, తల్లి తండ్రిలేక, నామ మాత్రపు అన్నలతోనూ అక్కలతోనూ, ఏదో తెలియని దైవ శక్తితో బ్రతుకుతున్నాను నేను. ఎప్పుడూ లాటరీ టికెట్లు కొనని నాకు

బలవంతంగా ఒక వ్యక్తి లాటరీ టికెట్ చేతిలో పెట్టి వెళ్ళిపోయాడు. దానికి లక్ష రూపాయలు బహుమతి వచ్చింది. మిమ్మల్ని ఆదుకోవడం కంటే నాకు ఆనందం ఏముంది? హైదరాబాదు వెళ్ళి డబ్బు తీసుకుని మీ దగ్గరకు వస్తాను మీ అవసరాలు తీరేక, డబ్బు మిగిలితే నా సంగతి చూసుకుంటాను. మాతృ సమానురాలు అత్తగారికి వందనాలు.

– మీ భాస్కరం.

తడి అయినా నా కళ్ళు-ఎప్పుడు వచ్చిందో నా వెనుకనే వుంది ఉత్తరం చదివిన శ్రీమతి నా ముందుకు వచ్చి, నన్ను ఆమె చూసిన చూపు

ఆమె చూపుకు శక్తి వుండే నేను ఏమయివుండే వాడినో

నా తల నేల తల్లిని చూస్తోంది.

***